# ‘పేరిణి నాట్యానికి పూర్వ వైభవం’



నాంపల్లి: కాకతీయుల వారసత్వ కళ పేరిణి నాట్యానికి పూర్వ వైభవం తీసుకొస్తామని సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ అన్నారు. రవీంద్ర భారతిలో మంగళవారం రాత్రి పేరిణి నాట్య గురువు పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ 93వ జయంతి ఉత్సవం నిర్వహించారు. పేరిణి నాట్యాన్ని ప్రత్యేక కోర్సుగా సంగీత కళాశాలల్లో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవం నాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, పేరిణి నాట్యాచార్యులు కళాకృష్ణ, పేరిణి ప్రకాష్, నాగభూషణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# హాస్య ఆణిముత్యం బ్రహ్మానందం



బ్రహ్మానందం దంపతులను సత్కరిస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: తెలుగు వారికి దొరికిన హాస్య ఆణిముత్యం బ్రహ్మానందమని నగర మేయర్ బొంతు రామ్మోహన్ కొనియాడారు. రవీంద్రభారతిలో మంగళవారం పద్మమోహన ఆర్ట్స్ 26వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మమోహన విశిష్ట దంపతుల పురస్కారాన్ని బ్రహ్మానందం దంపతులకు అందజేశారు. మేయర్ బ్రహ్మానందానికి స్వర్ణకంకణం తొడిగి, దంపతులను సత్కరించారు. ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ హాస్యానికి కేరాఫ్ బ్రహ్మానందమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మమోహన ఆర్ట్స్ వ్యవస్థాపకులు డి.యాదగిరి, సుఖీభవ ప్రాజెక్ట్స్ సీఎండీ ఎ.గురురాజ్, కె.మాధవరెడ్డి, వై.మల్లేశం, ఎంఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మరిన్ని సినిమాలు చేస్తాను..**

హాస్యనటన భగవంతుడు తనకిచ్చిన వరమని బ్రహ్మానందం అన్నారు. సుదీర్ఘ సినీ ప్రయాణంలో 1056 సినిమాలు చేశానని, మరిన్ని సినిమాల్లో నటిస్తానని చెప్పారు.







# రంగు బరసే..

**అబిడ్స్ చాపెల్ రోడ్‌లోని స్టాంఢ్లీ ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో హోలీ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు రంగులు చల్లుకొని ఆడిపాడి సందడి చేశారు.**

*- అబిడ్స్*

# ‘రాంకీ ట్రాంక్విల్లాస్’ ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాంకీ ఎస్టేట్స్ అండ్ ఫామ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నందకిషోర్, రాంకీ విహ ప్రాపర్టీస్ లిమిటెడ్ డైరెక్టర్ రమేశ్ రెడ్డివరి

సాక్షి,సిటీబ్యూరో: ప్రశాంతమైన నగర జీవితానికి దర్పణం పట్టే రాంకీ ట్రాంక్విల్లాస్ రెసిడెన్షియల్ విల్లాస్ ప్రాజెక్టును కిస్మత్‌పురాలో రాంకీ ఎస్టేట్స్ అండ్ ఫామ్స్ లిమిటెడ్ ప్రారంభించింది. ఐటీ హబ్‌కు సమీపంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు మొత్తం 17 ఎకరాల్లో 105 విల్లాలతో అందుబాటులోకి రానుంది. అన్ని రకాల సదుపాయాలతో వీటిని నిర్మించనున్నారు. మాదాపూర్‌లోని వెస్టిన్ మైండ్‌స్పేస్‌లో ఈ నెల 21న ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

## ఆర్టీఏ కార్యాలయంలో స్పీకర్


డిజిటల్ ప్యాడ్‌పై సంతకం చేస్తున్న స్పీకర్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి తాను కొత్తగా కొనుగోలు చేసిన ఇన్నోవా కారు రిజిస్ట్రేషన్ కోసం మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా రవాణా కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా, జేటీసీ రఘునాథ్, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వాహనం రిజిస్ట్రేషన్‌కు స్పీకర్ నిబంధనల మేరకు ఫీజు చెల్లించి, డిజిటల్ ప్యాడ్‌పై సంతకం చేసి ఫొటో దిగారు. తనకు నచ్చిన నెంబర్ ‘టీఎస్ 09 ఈఎల్ 5555’పై వాహనం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

## ఎండ@ 39.4 డిగ్రీలు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో మంగళవారం గరిష్టంగా 39.4, కనిష్టంగా 20.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

